క్లుప్తంగా

11న గుంటుపాలెంకు ఎమ్మెల్యే రాక

శావల్యాపురం: మండలంలోని గుంటుపాలెం గ్రామంలో ఈనెల 11న ఉదయం 10 గంటలకు వైఎస్సార్ క్లినిక్, రైతుభరోసా కేంద్రాలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదగా ప్రారంభోత్సవం చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు శుక్రవారం తెలిపారు. అలాగే అదేరోజు మండలంలోని కారుమంచి వయా మతుకుమల్లి గ్రామాల మధ్య ప్రధాన కూడలి మార్గంలో కారుమంచి సొసైటీ వారి సారథ్యంలో నూతన పెట్రోలు బంకు ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల, గ్రామ ప్రజాప్రతినిధులు అందరు పాల్గొని ఈకార్యక్రమం జయప్రదం చేయాలన్నారు.

1485 మహిళలకు వైఎస్సార్ చేయూత లబ్ధి

శావల్యాపురం: వైఎస్సార్ చేయూత పథకంలో అర్హత కలిగియున్న లబ్ధిదారులందరికీ పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నామని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి శుక్రవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 45 నుంచి 60 సంవత్సరాల లోపు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలు జీవనోపాదులు ఒక్కో మహిళకు రూ.18 వేల 750 రూపాయలు నాల్గవ విడత నగదు ప్రభుత్వం ఈనెలలో విడుదల చేస్తుందన్నారు. మండలంలో 15 గ్రామపంచాయతీల్లో 1485 మంది లబ్ధిదారులు ఎంపిక కాగా 1442 మంది లబ్ధిదారులు బయోమెట్రిక్ వలంటీర్లు ఈకేవైసీ నమోదు చేసినట్లు తెలిపారు.

బుచ్చిబాపన్నపాలెం సొసైటీకి నూతన పాలక వర్గం



రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్ పర్సన్‌గా రామిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పాలూరి పేరిరెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సహకార శాఖ అధికారి స్వర్ణ చినరామిరెడ్డి చైర్ పర్సన్ పేరిరెడ్డితో పర్సన్‌లు సంగన వెంకట కృష్ణారెడ్డి, మారెళ్ల శ్రీహరినాథ బాబుతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని నూతన కమిటీకి ఆయన సూచించారు. బాధ్యతలు చేపట్టిన చైర్‌పర్సన్‌ను ఎంపీపీ గడ్డం వెంకట్రావు, మండల పార్టీ అధ్యక్షుడు కురుగుంట శ్రీనివాసరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, గానగపంట ఉత్తమరెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, మోతుకూరి వెంకటేష్, సీఈవో జి. వీరారెడ్డి తదితరులు అభినందించారు.

రొంపిచర్లలో 15 క్వింటాళ్ల మిర్చి చోరీ



రొంపిచర్ల: కల్లంలో ఆరబోసిన ఎండు మిర్చి చోరీకి గురైన సంఘటన రొంపిచర్లలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాల్లో కెళితే.. రొంపిచర్లకు చెందిన గొట్టం శివారెడ్డి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌హైవే పక్కన నాలుగు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని మిర్చి పంటను సాగు చేశాడు. మిర్చి పొలంలో కూలీలతో కాయలు కోయించి పొలం పక్కనే కల్లంలో మిర్చి ఆరబోశారు. ప్రతి రోజూ రాత్రి ఏడు, ఎనిమిది గంటల వరకు కల్లం వద్దనే ఉండి రైతు ఇంటికి వచ్చేవాడు. కాయలు డ్రై అవ్వటంతో కల్లంలోనే రాశిగా పోశాడు. ఉదయాన్నే రైతు కల్లం దగ్గరకు చేరుకోగా రాశిలో ఉన్న సుమారు 15 క్వింటాళ్ల వరకు మిర్చి కాయలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దొంగిలించిన మిర్చి కాయల విలువ రూ.3 లక్షల రూపాయలు ఉంటుందని బాధిత రైతు శివారెడ్డి తెలిపారు. ఆరుగాలం శ్రమించి పండించిన మిర్చి పంట చోరీకి గురికావడంతో తీవ్రంగా నష్టపోయానని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కల్లం వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రైతు శివారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కేపీ రవిచంద్ర తెలిపారు.

జగనన్నను ఎదుర్కోలేక.. ఢిల్లీలో మొక్కులు

- చంద్రబాబుపై ఎమ్మెల్యే గోపిరెడ్డి విమర్శలు
- బుచ్చిబాపన్నపాలెంలో అభివృద్ధి కార్యక్రమాలు ఆరంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేకనే చంద్రబాబునాయుడు ఢిల్లీ వెళ్లి అమిత్‌షా, నరేంద్రమోడీల కాళ్లమీద పడుతున్నాడని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని ఆయన స్వగ్రామమైన బుచ్చిబాపన్నపాలెంలో రూ.4 కోట్ల రూపాయలతో నిర్మించిన సచివాలయం, మల్టీపర్పస్ గోడౌన్, సీసీ రోడ్లు ప్రారంభించగా, రూ.2.78 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించి తలపెట్టిన మంచినీటి పథకం ప్రారంభించారు. 500 గృహాలకు మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. 20 సంవత్సరాల తెలుగుదేశం పాలనలో తమ గ్రామానికి ఒక్క రూపాయి ప్రయోజనం కూడా చేకూరలేదన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ.26.64 కోట్ల రూపాయలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు వెచ్చించామన్నారు.

రూ.2.20 కోట్ల వ్యయంతో 11 కేవీ సబ్ స్టేషన్‌ను నిర్మించామన్నారు. రూ.45 లక్షలతో నాడు-నేడు కింద పాఠశాలలు అభివృద్ధి చేశామన్నారు. గ్రామంలోని అప్పర్ ప్రైమరీ పాఠశాలను హైస్కూల్‌గా రూపాంతరం చేశామన్నారు. అలాగే ముస్లిం సోదరులు మసీద్‌కు రూ.20 లక్షల రూపాయలతో కాంపౌండ్ వాల్ నిర్మించామన్నారు. తన తండ్రి గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి జ్ఞాపకార్థం గ్రామంలో రూ.1 కోటి రూపాయలతో కల్యాణ మండపం, రూ.60 లక్షల రూపాయలతో వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.1.10 కోట్ల రూపాయలతో గోగులపాడు నుంచి ముప్పాళ్ల రోడ్డుకు రోడ్డు నిర్మాణం చేస్తున్నామన్నారు. రొంపిచర్లలో కేంద్రియ విద్యాలయాన్ని సంతగుడిపాడులో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేస్తుండగా, విప్పర్ల రెడ్డిపాలెంలో రూ.11 కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులను కల్పించటమే జగన్ మోహన్ రెడ్డి ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. నియోజకవర్గంలో గ్రామాల్లో, పట్టణాల్లో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమేనా అని టీడీపీ నేతలకు సవాల్ చేశారు. రానున్న ఎన్నికల్లో గ్రామస్తులందరూ ఏకతాటిపై నడిచి తనను ఎమ్మెల్యేగా, జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి సీఎంగా ఎన్నుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం వెంకట్రావు, మండల పార్టీ అధ్యక్షుడు కురుగుంట శ్రీనివాసరెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబ శివారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బత్తుల రామకృష్ణ, అన్నెం పున్నారెడ్డి, గుండాల వెంకటేష్, చీమల శ్రీనివాసరెడ్డి, పోతులూరి సుబ్బారెడ్డి, గజ్జల మునలారెడ్డి, తిరుపతయ్య, ఓర్సు కోటేశ్వరరావు, సొసైటీ చైర్ పర్సన్ పాలూరి పేరిరెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, మోతుకూరి వెంకటేష్, పల్లపు అంజయ్య, చపారపు సంజీవరెడ్డి, కోడూరి వెంకటేశ్వరరెడ్డి, మండల మైనార్టీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, కల్లం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు

తహసీల్దారు లక్ష్మి లావణ్య



శావల్యాపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామని తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు తప్పనిసరిగా ఓటు హక్కు కల్పిస్తామన్నారు. మండలంలోని 34 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ఇప్పటికే సందర్శించి మౌలిక వసతుల ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల కమిషనర్ నిబంధనల మేరకు ఓట్లు చేర్పులు మార్పులు తొలిగింపులు తదితరవన్నీ చేస్తామన్నారు. బీఎల్‌వోలు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఓట్ల విషయంలో ప్రజలు అపోహలు నమ్మరాదన్నారు. అన్నీ పార్టీల నాయకులు సహకారంతో డబల్ ఎంట్రీలు ఉన్న ఓట్ల తొలగింపులు తగిన ఆధారాలతో తొలగిస్తామన్నారు. ఒక వ్యక్తికి ఒకేచోట మాత్రమే ఓటు హక్కు కల్గియుండాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు అనే కార్యక్రమంలో భాగంగా ఇంటి నివేశిత పట్టాలు కలిగి ఉన్న లబ్ధిదారుల సమగ్ర వివరాలన్నీ గ్రామ సచివాలయాలు ద్వారా ఆన్‌లైన్ విధానంలో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దారుతో పాటు డిప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పేరిసోముల నాసరయ్య, వీఆర్వోలు మల్లెల రాధ, ఉప్పుటూరి చిన మంగయ్య పాల్గొన్నారు.

గోల్డ్ అప్రైజర్‌లను పర్మినెంట్ చేయాలి



నాదెండ్ల: జాతీయ బ్యాంకుల్లో పనిచేసే స్వర్ణకార గోల్డ్ అప్రైజర్‌లను పర్మినెంట్ చేయాలంటూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రెండు రోజుల పాటూ ఆందోళన నిర్వహించినట్లు అప్రైజర్ల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు కీర్తి సురేష్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోల్డ్ అప్రైజర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కేంద్ర న్యాయశాఖా మంత్రి శ్రీరామ్‌దాస్ అధావలే, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, జాతీయ బీసీ సంఘం కమిషనర్ హంసరాజ్ గంగారామ్‌లను కలిసి వినతి పత్రాలు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య స్పందిస్తూ అప్రైజర్ల సమస్యలను వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావిస్తానని హామీనిచ్చినట్లు తెలిపారు. వినతిపత్రాలు అందించిన వారిలో జాతీయ బీసీ సంఘం అధికార ప్రతినిధి నల్లమాటి కొండలరావు, ఢిల్లీ ఇంచార్జి కర్రి వేణుమాధవ్, గుంటూరు ఇంచార్జి యక్కల భార్గవ్, చిలకలూరిపేట ఇంచార్జి సంతరావూరి బ్రహ్మం, ఉయ్యూర్ ఇంచార్జి చేపూరి రవిసుధాకర్, ప్రతినిధుల బృందం ఉన్నారు.

కొండవీడు ఫెస్ట్‌ను విజయవంతం చేయాలి

నాదెండ్ల: యడ్లపాడు మండల కొండవీడులో రెండు రోజుల పాటూ జరిగే కొండవీడు ఫెస్ట్‌కు యువత, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాదెండ్ల ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ చెప్పారు. ఉదయం 10 నుండి సాయంత్రం 8 గంటల వరకూ జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సాహాన్ని పొందాలని కోరారు. సాయంత్రం డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తారన్నారు.

మాజీ ప్రధాని పీవీకి భారతరత్న పట్ల హర్షం



నరసరావుపేట ఈస్ట్: భారత మాజీ ప్రధాని పీవీ నరసింహా రావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించటం పట్ల బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సంఘం కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు బిడ్డగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, దేశప్రధానిగా పీవీ అందించిన సేవలను కొనియాడారు. పీవీకి భారతరత్న రావటం తెలుగుజాతి గర్వించదగిన అంశమని తెలిపారు. దేశంలో ఆధునిక సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రపంచ అభివృద్ధి చెందిన దేశాల సరసన భారతదేశాన్ని నిలిపారని ప్రశంసించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ముత్తనపల్లి శివ రామకృష్ణప్రసాదు, కార్యదర్శి కె.వి.పురుషోత్తమరావు, కోశాధికారి విష్ణుభట్ల మధుసూదనప్రసాదు, కోట సాంబశివరావు, శ్రీగిరిరాజు అయ్యపరాజు, వాగ్దేవి స్మార్త పురోహిత సంఘం అధ్యక్షుడు మేళ్లచెర్వు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న తెలుగువారికి గర్వకారణం

నరసరావుపేట: దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించటం హర్షణీయమని, ఇది తెలుగువారందరికీ గర్వకారణమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రంగిశెట్టి రామకృష్ణ శుక్రవారం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు

- పట్టణంలో 2,230 సర్వీసుల పరిశీలన
- 163 మందికి రూ.7.93 లక్షలు అపరాధ రుసుం



దాడుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

నరసరావుపేట: పట్టణంలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 163 మందికి రూ.7.93 లక్షల అపరాధ రుసుం విధించినట్లు విద్యుత్‌శాఖ విజిలెన్స్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.సూర్యప్రకాష్, ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో 2,230 సర్వీసులను తనిఖీ చేశామన్నారు. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఐదుగురుకి రూ.20 వేలు, మీటరు కలిగి ఉన్నా అక్రమ చౌర్యానికి పాల్పడుతున్న ఒక వ్యక్తికి రూ.20 వేలు, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరీలలో విద్యుత్ వాడుతున్న ఆరుగురికి రూ.30 వేలు, అనుమతించిన లోడు కంటే అధికంగా విద్యుత్ వినియోగిస్తున్న 148 మందికి రూ.6.93 లక్షలు, అసలైన వాడకం కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన మూడు సర్వీసులను గుర్తించి రూ.30 వేలు అపరాధ రుసుం విధించామన్నారు. వినియోగదారులు అందరూ మీటర్లకు సీళ్ల తప్పకుండా ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. అవి ఊడిపోతే సిబ్బందికి రాతపూర్వకంగా తెలియచేయాలన్నారు. అధికారుల తనిఖీల్లో సీలు లేకపోవటం, ఉద్దేశ్యపూర్వకంగా తొలగించుడం, గాట్లు పెట్టడం వంటివి గమనిస్తే విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసులు నమోదు చేస్తామన్నారు. పనిచేయని మీటరు నుంచి విద్యుత్ వాడుకున్నా, ఉండాల్సిన మీటరు కంటే వేరే మీటరు పెట్టి సీలు లేకుండా విద్యుత్ వాడినా విద్యుత్ చౌర్యం జరిగినట్లుగా పరిగణించబడుతుందన్నారు. మొదటిసారి తప్పిదానికి కాంపౌండింగ్ ఫీజు, రెండోసారి తప్పిదానికి అరెస్టు, రిమాండ్‌కు పంపి కఠినంగా వ్యవహరిస్తామన్నారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, వీటిపై ఫిర్యాదులను 94408 12263, 94408 12360, 94408 12361 నంబర్లకు ఫోన్‌చేసి లేదా వాట్సప్ ద్వారా తెలియచేయవచ్చన్నారు. దాడుల్లో 39 మంది అధికారులు, 117 మంది సిబ్బంది 29 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారన్నారు. డీఈలు కె.రవికుమార్, వై.ఏడుకొండలు, ఏఈలు కె.కోటేశ్వరరావు, షేక్ రఫీ పాల్గొన్నారన్నారు.

సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలి

- అదే ప్రభుత్వ లక్ష్యం
- ఎంపీపీ తలతోటి రాణి
- చిరుమామిళ్ళలో 405 మందికి వైద్య పరీక్షలు

నాదెండ్ల: రాష్ట్ర ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. చిరుమామిళ్ళ కాసు రాఘవమ్మ, బ్రహ్మనందరెడ్డి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రాణి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో రెండో విడత సురక్ష మెడికల్ క్యాంపులు జరుగుతున్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ జ్ఞానేశ్వరి, గైనకాలజిస్ట్ దత్తశ్రీ, జనరల్ ఫిజీషియన్ సునంద పాల్గొని 405 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు రిఫర్ చేశారు. అనంతరం లబ్ధిదారులకు మెడికల్ కిట్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, నాదెండ్ల గణపవరం సొసైటీల అధ్యక్షులు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, నాదెండ్ల సొసైటీ మాజీ అధ్యక్షుడు సింగారెడ్డి కోటిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అల్లడి రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఏఎస్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పండరీపురం, ఎన్ఆర్‌టీ సెంటర్ తదితర ప్రాంతాలతో పాటు చిలకలూరిపేట మండలంలోని బొప్పూడి, తాతపూడి, రామచంద్రాపురం, మురికిపూడి, పసుమర్రు, దండమూడి తదితర గ్రామాలలో సైతం సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నరసరావుపేట పరిధిలో...

నరసరావుపేట: సబ్‌స్టేషన్ మరమ్మతులు, లైన్లలో చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా పట్టణం, మండల పరిధిలో శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు శుక్రవారం వెల్లడించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రొంపిచర్ల పరిధిలో...

రొంపిచర్ల: మండలంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. పిడుగురాళ్లలో గల 220 కె.వి.విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. మండలంలో రొంపిచర్ల, మర్రిచెట్టుపాలెం, సుబ్బయ్యపాలెం, బుచ్చిబాపన్నపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో గల గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు. అదే విధంగా రైతులకు శనివారం రాత్రి 12 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు 3 ఫేస్ విద్యుత్ సరఫరా ఇవ్వబడుతుందన్నారు.

నులి పురుగులతో అనారోగ్యం

- నివారణకు మాత్రలు వాడాలి
- విద్యార్థులకు వైద్యుల సూచన
- వేర్వేరు ప్రాంతాల్లో ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ



శావల్యాపురం ఎంపీపీ స్కూల్లో కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవోలు



రొంపిచర్లలో మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ రేవతిబాయి

నాదెండ్ల: నులిపురుగుల కారణంగా రక్తహీనత, పోషకాల లోపం తలెత్తి అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిశ్వేత చెప్పారు. గణపవరం, నాదెండ్ల పీహెచ్‌సీల పరిధిలో శుక్రవారం నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేశారు. గణపవరం పీహెచ్‌సీ పరిధిలో సుమారు 1500 మందికి పైగా విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేశారు. చిరుమామిళ్లలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మీ పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గణపవరంలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి ఆర్.ప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా మండలంలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలలు అంగన్‌వాడీ సెంటర్లు నందు 01 నుంచి 19 సంవత్సరాలలోపు చిన్నారుల అందరికీ అల్‌బెండజోల్ మందు బిళ్లలు మింగించే కార్యక్రమం నిర్వహించినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజన అనంతరం మందు బిళ్లలు మింగించే కార్యక్రమం వైద్యాధికారి ప్రారంభించారు. అలాగే స్థానిక ఎంపీపీ స్కూల్లో ఎంఈవోలు మద్దికుంట సాంబశివరావు, పుసులూరి లలితా కుమారిలు విద్యార్థులకు అల్‌బెండాజోల్ మందు బిళ్లలు మింగించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు ఏడుకొండలు ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్త ఇంకోల్లు నాగలక్ష్మి అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్బెండిజోల్ మాత్రలను శుక్రవారం పంపిణీ చేశారు. 26 ప్రభుత్వ పాఠశాలలు, ఒక కాలేజీ, ఒక ప్రైవేటు పాఠశాల, 31 అంగన్‌వాడీ కేంద్రాల్లో 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఈ మందులను అందజేశారు. పీహెచ్‌సీ పరిధిలో 5541 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేయాల్సి ఉండగా, 5319 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేశామన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: ప్రతి విద్యార్థి ఆల్‌బెండాజోల్ మాత్రను విధిగా వేసుకోవాలని..తద్వారా అనారోగ్య సమస్యలు సగం దరిచేరనివ్వవని ఎంఈవో -2 అరుణకుమారి తెలిపారు. మండలంలోని ఉన్నవ జిల్లాపరిషత్ హైస్కూల్లో నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె విద్యార్థులకు మాత్రలను వేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

ముగిసిన ఆఫ్‌లైన్ శిక్షణ

యడ్లపాడు: ఆంగ్ల ప్రావీణ్యం ప్రామాణిక పరీక్షపై ఏర్పాటు చేసిన రెండు రోజులు ఆఫ్‌లైన్ శిక్షణ శుక్రవారం ముగిసింది. బోయపాలెంలోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థలో రెండో రోజు శిక్షణకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంపిక చేసిన వివిధ ప్రభుత్వ పాఠశాలల్లోని 40 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని మాట్లాడుతూ ఆఫ్‌లైన్ శిక్షణలో నేర్చుకున్న అంశాలతో పాటు తప్పని సరిగా ఆన్‌లైన్‌లోనూ రెండు రోజులు శిక్షణలో ఉపాధ్యాయులు పాల్గొనాల్సి ఉందన్నారు. అప్పుడే పూర్తి విషయాలను తెలుసుకుని వాటిని క్షేత్రస్థాయి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించే వీలుంటుందన్నారు.

దింతెనపాడులో గ్యాస్ సిలెండర్ లీక్

యడ్లపాడు: ప్రమాదవశాత్తు వంటగ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో పెనుప్రమాదం తప్పిన సంఘటన మండలంలోని దింతెనపాడు గ్రామంలోని ఎస్సీకాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..ఇంట్లో కొద్దిమొత్తంలో భోజనాలను సిద్ధం చేసుకుంటుండగా ఒక్కసారిగా గ్యాస్ సిలెండర్‌కు ఉన్న పైపు కాలిపోయి నేరుగా సిలెండర్ నుంచి పెద్దగా మంటలు వ్యాపించాయి. దీంతో ఇంటి యజమాని తుమ్మలగుంట నోబుల్ మంటలు వస్తున్న సిలెండర్‌ను చేతితో పట్టుకుని బయటకు తెచ్చే క్రమంలో ముఖంపై మంటసెగ తగిలి కమిలి పోయింది. కొద్దిసేపటికి సిలెండర్‌లోని గ్యాస్అంతా అయిపోయి అదే ఆరిపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో నోబుల్ ఇంటి గడప, తలుపు చెక్కలు కొద్దిగా కాలిపోయాయి.